# కొత్త రచయితలు

నాతో చదువుకొని నాతోపాటు టీచరు ఉద్యోగం చేస్తూన్న నా మిత్రుడు శివరావు పెళ్ళికి ఓ వారం రోజులు సెలవు పెట్టి విజయనగరం వెళ్ళాను. పెళ్ళికూతురు కూడా వాళ్ళ బంధువు అమ్మాయే కాబట్టి ఆ వూళ్ళోనే పెళ్ళి. వచ్చే బంధుమిత్రుల కోసం ఇరువైపుల వాళ్ళు రెండు పెద్ద మేడలు విడిదికి తీసుకున్నారు.

## లవ్ స్టోరీ

## ఓ పరిచయం - ఓ పరిమళం

పెండ్లి ఇక అయిదు రోజులుందనగా మా విడిదిలోకి వచ్చిన పెండ్లికొడుకు స్నేహితులమూ చుట్టాలమూ పెండ్లికూతురు తరుపువాళ్ళు ఆ రాత్రి భోజనానికి పిల్చారు.

మా ఎదురుబంతిలో ఆడవాళ్ళకు వడ్డిస్తూంది ఓ అమ్మాయి. ఆమెకు ఇరవై ఏళ్ళుండొచ్చు. ముఖంలో మంచి కళ - ఛామనఛాయ, బొద్దుగా ముద్దుగా కలుపుగోలుతనంతో పలకరిస్తూ వాళ్ళకు ఏం కావాలో చూసుకుంటూ - అటూ ఇటూ తిరుగుతూన్న ఆమెను చూస్తూంటే మరీ మరీ చూడాలనిపిస్తుంది.

తనివితీరా చూడాలనే కోరిక ఓ పక్క, సభ్యత, సంస్కారం మరో పక్క బలీయంగా నా కోర్కెను అణచుకున్నా.

మా వైపు మంచినీళ్ళు పోస్తూన్న కుర్రాడ్ని పిలిచి... "ఆవిడెవరు?" అని అడిగాను అటు వైపు చూస్తూ.

"ఆమె మా సంగీతక్క.. నిన్ననే ఊర్నుంచి వచ్చింది" అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఆమె ఆడవాళ్ళకు వడ్డిస్తూండడం చూస్తే ఎంతో అణకువ కల వ్యక్తిలా వుంది. చిరునవ్వులు చిందిస్తూ పలకరిస్తూ ఓ చేత్తో గిన్నె, మరో చేతితో నుదుటికి పట్టిన చెమటను తుడుచుకుంటూ మా వైపు వచ్చింది "సాంబారు కావాలండీ?" అంటూ.

నేను వెంటనే "ఇటు రండి!" అని పిల్చాను.

ఆవిడ పోస్తుంటే ఆవిడ వంక కన్నార్పకుండా చూస్తూ — "మీ బొట్టుబిళ్ళ చెమటకు బాగా తడిసి స్థానభ్రంశం చెందింది" అన్నాను.

నా ధైర్యానికి నేనే ఆశ్చర్యపోయాను.

ఆమె నా వంక అదోలా చూసి — గంభీరంగా వెళ్ళిపోయింది.

మళ్ళీ కనబడలేదు. కాస్సేపైనా ఆమెతో మాట్లాడాలన్న నా కోరిక నెరవేరలేదు. భోజనాలు ముగించి మా విడిదిలోకి వచ్చాం.

'ఆవిడెవరు? ఎంతవరకు చదువుకుంది? పెళ్ళయిందా? కాకపోతే నన్ను పెళ్ళి చేసుకోవడానికి ఇష్టపడుతుందా?'

నా బుర్రలో మెదలుతున్న ఈ ప్రశ్నలు నన్ను నిలవనీయడం లేదు. ఎంతోమంది ఆడవాళ్ళను చూశాను. కాలేజీ ఆడపిల్లలతో పరిచయాలున్నాయి. కానీ ఎప్పుడూ ఇంత టెన్షన్ పొందలేదు. ఆవిడ నన్ను ఆకర్షించింది. అందగత్తె కాదు. కట్టు-బొట్టు- తీరు నన్ను ముగ్ధుడ్ని చేశాయ్! ఆమెను నా జీవిత భాగస్వామిని చేసుకోవాలి. ఆ రాత్రి భారంగా నిద్రపోయాను.

పొద్దునే శివరావు వచ్చాడు. మాటల మధ్యలో అడిగాను సంగీత అనే అమ్మాయి ఎవరని

నావంక కాస్సేపు ఆశ్చర్యంగా, ప్రశ్నార్థకంగా చూశాడు 'నీ కెందుకు?' అన్న ధోరణిలో

"వాళ్ళ వాళ్ళ దగ్గరికి మా వాళ్ళను పంపిద్దామని."

భావార్థకంగా ముఖం పెట్టాను, అర్థం చేసుకోమని.

"ఒరేయ్! స్త్రీ మా జీవితం పండులాంటిది. కుళ్ళిపోయిన పండు కాదు. నలుగురిలో నవ్వులపాలు కానాకు" అన్నాడు. కాస్సేపాగి, "సంగీత మా బంధువులమ్మాయే. నేను చేసుకోబోయే నీరజకు పిన్నతల్లి కూతురు. సంగీతకు పెళ్ళయింది. మూడేళ్ళ కూతురుంది. పిచ్చిపిచ్చిగా ఆలోచించకు. భ్రమలు పెట్టుకోకు" కొద్దిగా తీవ్రంగానే అన్నాడు.

ఆ మాటలకు హతాశుడినయ్యాను. "సారీ.. రా! ఏమనుకోకు" అన్నాను — నా కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి.

"ఎంతయినా బంధువులమ్మాయి. చెప్పకుంటే బాధగా వుంటుందని ఓ విషయం చెప్పలేదు. మనవాళ్ళతో ఎవ్వరితోను అనవాకు చులకనగా చూస్తారు."

సరేనన్నట్లు తలూపాను.

"ఆమె భర్త ఓ కంట్రాక్టరు. పెళ్ళయిన సంవత్సరంలోనే మ్యాటర్ యాక్సిడెంట్‌లో మరణించాడు. అల్లుడు పోయిన దిగులుతో నీళ్ళ నాన్న పోయాడు. ఏదో కొద్దిపాటి ఆస్తి— వెనుకా ముందు ఎవ్వరూ లేరు. బాధలు మర్చిపోవడానికి నర్సు ట్రైనింగ్‌లో చేరింది. పెళ్ళికి రానంటే నీరజ బలవంతంచేసి పిలిపించింది. ఇక వస్తా! నాకు పనుంది" అంటూ వెళ్ళిపోయాడు.

నా మస్తిష్కం మొద్దుబారింది.

ఆ రాత్రి అంతా నా కళ్ళమ్మట నీళ్ళు. పెళ్ళికి వచ్చిన స్నేహితులు భోజనానికి పిల్చినా వెళ్ళలేకపోయాను. నా జీవితం నా భవిష్యత్తు బాగా ఆలోచించుకున్నాను. దైవ నిర్ణయం ఎలా వుంటే అలాగే జరుగుతుంది.

మంచి వ్యక్తి. కళ గల మొహము... ఆ రూపము పదే పదే నా కళ్ళలో మెదులుతూంది. తర్వాత ఎక్కడా సంగీత నాకు కనబడలేదు. నేను ఎవ్వరినీ ఆమె గురించి అడగలేదు.

తెల్లవారితే పెళ్ళి. పెండ్లి మంటపంలో ఓ పక్క కుర్చీలో కూర్చొని అటూ ఇటూ చూస్తున్నా, తనేమైనా కనపడుతుందేమోనని. కానీ కనబడలేదు.

పెళ్ళి జరిగింది. మధ్యాహ్నం భోజనాల సమయంలో ఆడవాళ్ళ బంతిలో వడ్డిస్తున్న ఆమెను చూసి నా మనస్సు గంతులేసింది ఆవిడతో ఎలాగైనా మాట్లాడాలని. నేను వద్దనకు వుపక్రమించాను. ఇద్దరం ఒకర్నొకరం చూసుకున్నాము. నన్ను చూసి తొట్రుపాటుతో చూపుడు వేలుతో బొట్టును సరిచూసుకొంది.

"మీ బొట్టు ఇక స్థానభ్రంశం చెందదులెండి" అన్నాను. అర్థంకాక నా వంక చూసింది.

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి
భీమ సిమెంట్



'నాకు మీ గతం తెలుసే'న్నట్లు చూశాను.

"మూగవోయిన సంగీతాన్ని నేను రాగం సరి కిద్దామని అనుకుంటున్నాను మీ కిష్టమయితే..." అన్నాను.

అంతే. కోపంగా, బాధగా, క్రూరంగా నా వైపు చూస్తూ ఛీత్కారంగా 'ఛీ' అంటూ లోనికి వెళ్ళిపోయింది.

సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో పెండ్లికొడుకు శివరావు, మరికొంత మంది వ్యక్తులు నేనుంటున్న విడిదిలోకి వచ్చారు.

అందరూ కోపంగా వున్నారు. కొట్టే స్థితి లోనూ వున్నారు.

"విధవరాలంటే అంత అలుసా! ఆ అమ్మాయి బావిలో పడి చస్తానని ఏడుస్తూంది. అందుకే పెళ్ళిళ్ళకు రాను అంటోంది" ఎవ్వరో అంటున్నారు.

"ఒరేయ్ శ్రీనూ! నా స్నేహితుడవని, చిన్నప్పట్నుంచి మనిద్దరం కలిసి మెలిసి తిరిగామనే గౌరవంతో చెపుతున్నాను. ఆ అమ్మాయికి క్షమా పణ చెప్పు! నీవు ఏమన్నావో, నీ భావం ఏమిటో నా కనవసరం. ఆ అమ్మాయి గౌరవ కుటుం బంలో పెరిగింది. తన జీవితం మోడువారినా పుట్టిన బిడ్డకు తల్లిలేని లోటు కూడా చేయకూడ దని వాళ్ళమ్మ వేయించుకున్న ఒట్టుతో బతికి వుంది. తల్లిని దిక్కులేని దాన్ని చేయొద్దని ఆమె మొరపెట్టుకుంటే జీవచ్ఛవంలా బతుకుతూంది. అంతటి సున్నితమైన ఆ అమ్మాయిని ఏడ్పించ డానికి నీకు మనసెలా వచ్చిందిరా! రోడ్ సైడ్ రోమియోలాగా నీ ప్రవర్తన నాకు తలవంపులు తెచ్చింది. నేను అడ్డులేకపోతే ఈ పాటికి వీళ్ళు నిన్ను ఏమైనా చేసుండేవాళ్ళు.. పద. పోయి క్షమాపణ చెప్పు..." అంటూ నా వంక తీక్షణంగా చూశాడు శివరావు.

"ఒరేయ్ శివ! నన్ను అర్థం చేసుకోరా! నే నెటువంటి వాడినో నీకు తెలుసుగదా!"

"పదవయ్యా! నీతులు చెపుతున్నావు" గుంపులో ఎవ్వరో అన్నారు.

ఆ సమయంలో అక్కడికి మా నాన్నగారు వచ్చారు. ఆయన్ని చూడగానే శివరావు ఖంగు తిన్నాడు. "అరే! మీరా! రండి... రండి" అంటూ ఆహ్వానిస్తూనే తనతోపాటు వచ్చిన వ్యక్తు లను ఏదో సర్దిచెప్పి పంపించేశాడు.

"ఏదో పెళ్ళి సంబంధం వుంది. అర్జంటుగా రమ్మని టెలిగ్రాం ఇచ్చాడు... అందుకని వచ్చాను."

పక్కకు పిలిచి శివరావుకు చెప్పాను. నా మనస్సులోని సంగతి. "సంగీతను మా నాన్నగారికి చూపించు. కాని ఒక్క విషయంలో నాకు సహాయం చెయ్. ఆమె విధవరాలని చెప్పకు. మూడేళ్ళ కూతురుందని చెప్పకు. ఎవ్వరి చేత చెప్పనీయనాకు. తర్వాత నేను చెప్పకుంటాను. ఆ విధంగా ప్రాపిస్తాను. సంగీతకు నా మాటగా చెప్పు. తన కూతురు నాకూ కూతురేనని... ఎలాగైనా వాళ్ళను ఒప్పించు. సంగీతకు నచ్చ చెప్పు. ఎలా చేస్తావో, ఏం చేస్తావో! మా పెళ్ళి చేయించే బాధ్యత నీది" అన్నాను అతని చేతులు పట్టుకుని.

శివరావు నా వైపు ప్రశంసాపూర్వకంగా చూశాడు.

"నీ మనస్సు అర్థం చేసుకోలేనందుకు క్షమించు.. మీ నాన్నగార్ని లోపలికి తీసుకెళ్ళు.. నేను తర్వాత వచ్చి కలుస్తాను" అంటూ మరో విడిది వైపు గబగబా కదిలాడు.

నా తండ్రి ఆ క్షణంలో రావడం నాకు మేలు జరిగింది. "పొద్దునే మాట్లాడుకోవచ్చులే రండి!" అంటూ లోపలికి తీసుకువెళ్ళాను.

నా తండ్రి ఆదర్శవాది. మా ఊళ్ళోనూ ఎంతో మందికి పునర్వివాహం జరిపించిన సంఘ సంస్కర్త. శివరావు కూడా ఎన్నోసార్లు తన తండ్రిని పరోక్షంగా పొగిడాడు. నా పెండ్లికి నా తండ్రి ఎలాగూ ఒప్పకుంటాడు. ఆ ధైర్యంతో పిలిపించాను. నా పని మరీ సులభమయింది.

రాత్రి ఒంటిగంట ప్రాంతంలో శివరావు నా దగ్గరికి వచ్చి "ఇప్పటిదాకా సమాలోచనలు జరిపి పరిష్కారాలు చూపి సంగీతను ఒప్పించాము. పొద్దునే మీకు మా ఇంట్లో పెండ్లిచూపులు ఏర్పాటు చేశాము" అని చెప్పి వెళ్ళిపోయాడు.

పెళ్ళిచూపుల తతంగం ముగిసిన తర్వాత "మీ మంచి మనస్సుకు నా కృతజ్ఞతలు. నా కూతురుకు తండ్రి లేని లోటు తీర్చారు. మీ ప్రేమ నిజంగా ఆకర్షణ అనుకున్నాను. కాని నిజంగా మీకు నేనంటే అనురాగం" అంది. ఆకతాయి కుర్రాడనని అనుకున్నందుకు క్షమించమని ప్రాధేయపడింది.

ఆ నెలలోనే మా పెళ్ళి కావలిలో జరిగి పోయింది.

◆◆◆


రచయిత చిరునామా:

కె. శ్రీనివాసరావు (టీచర్)

జి.ప.స. హైస్కూల్

పలుకూరు,

వయా సింగరాయకొండ : 523125